క్లుప్తంగా...

నేడు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను సోమవారం ఉదయం మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో నగరంలోని మలక్‌పేట్, చార్మినర్, ఎల్బీనగర్ నియోజకవర్గాల లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయనున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

శామీర్‌పేట్: కుల, మతాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయం పాలన అందిస్తున్నామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామంలోని గ్రేట్ గాడ్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ చర్చి 24 వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి మల్లారెడ్డితో పాటు డీసీఎంఎస్ వైస్‌చైర్మెన్ మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీ అనిత, స్థానిక సర్పంచ్ వనజ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల వదిలివేత


గౌడవెళ్లి చెరువులో చేపపిల్లలు వదులుతున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి, ఎల్లంపేట్ గ్రామాల్లో ఆదివారం ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను సర్పంచులు, మత్స్యకారులు గ్రామ చెరువులో వదిలారు. గౌడవెల్లి గ్రామంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు,మత్స్యకారులను గంగమ్మకు పూజలు చేసిన చేప పిల్లలను వదిలారు. ఎల్లంపేట్‌లో గ్రామ పాలకవర్గ సభ్యులు, మత్స్యకారులు చేప పిల్లలను చెరువులో వదిలారు.

కుట్టు మిషన్ల పంపిణీ


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆదివారం గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, అభయ ఫౌండేషన్ చైర్మన్ బాలచందర్ కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటమ్మ, శిక్షకురాలు అనిత, మహిళలు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మున్సిపల్ చైర్‌పర్సన్


మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి ఆదివారం తన జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. మున్సిపల్ పరిధిలోని ఎస్ఎల్ఆర్ కాలనీలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి మొక్కలు నాటి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్‌రెడ్డి, రజితవెంకటేష్, మున్సిపల్ కమీషనర్ రాములు, నాయకులు పాల్గొన్నారు.

ముందుకు సాగని 'మన ఊరు..మనబడి'

- 50 ప్రభుత్వ బడులకు మాత్రమే మోక్షం..!
- ఎంపికైన బడులు 176
- పాఠశాలల్లో అదనపు గదులు, మౌలిక వసతుల కల్పన లక్ష్యం
- నిధుల జాప్యంతో నత్తనడకన పనులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: సర్కారు పాఠశాలలను అన్ని వసతులతో సమున్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం నీరుగారుతోంది. మన ఊరు–మన బడి కింద అభివృద్ధి పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా... ఇప్పటి వరకు 50 ప్రభుత్వ బడుల్లోనే పనులు పూర్తయ్యాయి. మరో 96 పాఠశాలల్లో నిధులు జాప్యంతో పనులు నత్తకు నడక నేర్పుతుండగా, మిగతా ప్రభుత్వ బడుల్లో మాత్రం అభివృద్ధి పనులకు టెండర్ల గ్రహణం పట్టుకుంది.

◆ ఆయా పనులను సత్వరమే పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తే తప్ప... ముందుకు సాగని పరిస్థితి నెలకొందని విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

లక్ష్యం 176...పూర్తయినవి 50 మాత్రమే...

◆ ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్కారు బడులను కార్పొరేటు దీటుగా తీర్చిదిద్దాలనే ఈ కార్యక్రమం అనుకున్న స్థాయిలో పురోగతి లేకపోవడంతో నిరాశే ఎదురవుతోంది. దీంతో సమస్యల మధ్యే విద్యార్థులు చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో మన ఊరు–మన బడి కింద మొదటి విడతగా 176 పాఠశాలలు ఎంపిక చేయగా, అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, గ్రీన్ బోర్డులు, మరమ్మతు పనులను వేసవి సెలవుల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

రూ.70 కోట్లతో పనులు

◆ మన ఊరు–మన బడి కింద ఎంపికైన 176 ప్రభుత్వపాఠశాలల్లో 12 రకాల సమస్యలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించారు. మరుగుదొడ్లు, ప్రహరీలు, వంట గదులు, భోజనశాలలు వంటి నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేర్చగా, భవన మరమ్మతులు తదితర పనుల కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గ జిల్లా అభివృద్ధి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. నీటి వసతి తదితర మౌలిక వసతులు, స్థానిక అవసరాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. మొదటి విడతగా ప్రభుత్వం రూ.4 కోట్లు విడుదల చేయటంతో 15 మండలాల పరిధిలోని 50 ప్రభుత్వ బడుల్లో పనులు పూర్తి కాగా, మరో 30 ప్రభుత్వ బడుల్లో ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడం గమనార్హం. ఆయా బడుల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ధర గిట్టుబాటు కానందునే టెండర్ల ప్రక్రియలో నిర్మాణ సంస్థలు పాల్గొనటం లేదు. ప్రభుత్వ నిబంధన ప్రకారం బడుల్లో రూ.30 లక్షలకు మించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లయితే... టెండర్ల పక్రియకు వెళ్లాల్సి ఉంది.

స్థానికులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి


సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లో నిర్మించిన రెండు పడకల ఇళ్లను స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రెండు బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ రామారావుముదిరాజ్, ఉప సర్పంచ్ సత్యనారాయణగౌడ్ నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఉప సర్పంచ్ మాట్లాడుతూ మండల పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారిని విస్మరించి ఇతర నియోజకవర్గాల వారికి కేటాయించడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. మొదట స్థానికులకు ఇళ్లను కేటాయించాలన్నారు. ఎంపీటీసీ రామారావుముదిరాజ్ మాట్లాడతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పది శాతం ఇళ్లను స్థానికులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు హరీశ్‌ముదిరాజ్, జంగయ్య, కృష్ణ, నాయకులు జంగయ్యముదిరాజ్, వినోద్, యాదగిరి, సత్తయ్య, ప్రభాకర్, సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజల సొమ్ము దుర్వినియోగం


కొమ్మిడి శోభారాణి, ఎంపీటీసీ అంకుషాపూర్

ఘట్‌కేసర్: అర్హులైన పేదలకు అందాల్సిన దళిత బంధు, గృహలక్ష్మీ పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు కేటాయిస్తూ ప్రభుత్వం ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తోందని అంకుషాపూర్ ఎంపీటీసీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొమ్మిడి శోభారాణి అన్నారు. అంకుషాపూర్‌లో ఆదివారం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు ఇవ్వకుండా ఎన్నికల ముందు దరఖాస్తులు స్వీకరిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలు ప్రారంభించడమే కాని అమలు చేసింది లేదని, హామీలు తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర పథకాలను తమవిగా చెప్పుకుంటున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీఆర్ఎస్ సర్కారుకు నూకల చెల్లాయని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపూర్ ప్రాంతంలో వెంకటరమణ, సాయిఐశ్వర్య కాలనీల్లో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద వెలిసిన అక్రమ నిర్మాణాలపై 'ప్రమాదం..అయి నా నిర్మాణం' శీర్షికన శనివారం 'సాక్షి' లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు ఆదివారం అక్రమ కమర్షియల్ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


జవహర్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి భవిష్యత్ తరాలకు మెరుగైన జీవితాన్ని అందించేందుకు కృషి చేయాలని కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఆర్వో ప్రభాకర్‌యాదవ్, మెప్మా సీవో భార్గవి, కృష్ణప్ప, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం


ర్యాలీలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి, మేయర్ కావ్య తదితరులు

జవహర్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఫారూక్, బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, నాయకులు అహ్మద్ పాషా, రాజశేఖర్, సతీష్‌గౌడ్, మతిన్, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ పట్టణంలో..

మిలాద్–ఉన్– నబి వేడుకల్లో భాగంగా మేడ్చల్ పట్టణంలో ఆదివారం ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ పెద్ద మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా వీకర్ సెక్షన్ కాలనీ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి భద్రతా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సయ్యద్ ఇనాయత్ అలీ, లాయక్ అలీ, రఫీక్, సమాద్‌ఖాన్, మునీర్ మొలిసాబ్, ఆబెద్ తదితరులు పాల్గొన్నారు.


శాంతి ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి


ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న హెచ్‌పీసీఎల్ ఘట్‌కేసర్ టెర్మినల్ హెడ్ ప్రకాష్ తదితరులు

పోచారం: పర్యావరణానికి ప్లాస్టిక్ పెనుభూతంగా మారిందని హెచ్‌పీసీఎల్ ఘట్‌కేసర్ టెర్మినల్ హెడ్ పి ప్రకాశ్ అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆదివారం పోచారం మున్సిపాలిటీ నారపల్లి, భాగ్యనగర నందనవనం వద్ద జాతీయ రహదారిపై ప్లాస్టిక్‌ను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వందల సంవత్సరాలైనా భూమిలో కలవదని, వాడిన ప్లాస్టిక్‌ను డస్ట్‌బిన్‌లో వేసి రీసైకిల్ చేసి తిరిగి వాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఆదివారం గంట సమయం శుభ్రతకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, ముస్రాం, అల్తాఫ్, వంశీ, ప్రతిమ, శ్వేత, శ్రీను, నవీన్, నాగేశ్, సుదర్శన్, కృష్ణ, రాంచందర్, కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


ఘట్‌కేసర్ బస్ టెర్మినల్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమాన్ని కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, ప్రయాణికులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగీ, అనురాధా, మల్లేశ్, జహంగీర్, కోఆప్షన్ సభ్యురాలు అరుణ, సెయింట్ ఆంథోని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బాధ్యుడు అరుణ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏతం జంగయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనంతో మగ్గిపోతున్న సమాజాన్ని తట్టిలేపిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో దాసు, నర్సింహ్మా, రాందాస్, నర్సింగ్‌రావు, బాలయ్య, రామోజీ, కిరణ్‌కుమార్, ధీరజ్, సంజు, గణేశ్, ఉదయ్‌కిరణ్, రాకేశ్, నిఖిల్, నితిన్, ఉదయ్, దుర్గప్రసాద్, మల్లేశ్, అంజయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

అల్వాల్: రాష్ట్రంలో ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ మల్కాజిగిరి ఇన్‌చార్జి చంద్రమౌళి అన్నారు. ఆదివారం అల్వాల్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌లకు జనాభా ప్రతిపాదికన ఎమ్మెల్యే టికెట్‌లు కేటాయించాలని కోరారు. అనంతరం మచ్చబొల్లారం డివిజన్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు దశరథం, ప్రధాన కార్యదర్శి నరేష్, అల్వాల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శిగా దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, వెంకటాపురం డివిజన్ అధ్యక్ష కార్యదర్శిగా దొడ్డి నరసింహ్మా, గిరివేని చిన్నలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రొయ్యల క్రిష్ణమూర్తి, గురుమూర్తి అశోక్, శంకర్, ప్రసాద్, శీను, గంగాధర్, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం


ఆదిత్య (ఫైల్)

పోచారం: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉంటున్న ఇందారపు ఆదిత్య (20) ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి అతను తన మిత్రులు పవన్‌కుమార్, అరవింద్‌తో కలిసి బైక్‌పై అన్నోజీగూడకు వెళ్లారు. పవన్‌కుమార్ బైక్ నడుపుతుండగా ఆదిత్య వెనకాల కూర్చున్నాడు. టౌన్‌షిప్ నుండి బయటికి రాగానే అతి వేగం కారణంగా బైక్ అదుపుతప్పి సర్కిల్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో వారు కిందపడ్డారు. తలకు తీవ్రగాయాలైన ఆధిత్య, పవన్‌ను మేడిపల్లిలోని శ్రీకర ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆదిత్య అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పెద్దచెరువు వద్ద చెత్తను తొలగిస్తున్న ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్లు దీపికా నర్సింహా రెడ్డి, మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్లు దీపికా నర్సింహ్మా రెడ్డి, మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి కమిషనర్లతో కలిసి వీధులను శుభ్రం చేశారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణాలు, పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే జాతిపిత గాంధీకి అసలైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్లు త్రిల్లేశ్వర్, రాములు, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

కీసర: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు పాటుపడాలని నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వివిధ వార్డుల్లో కౌన్సిలర్లతో నిర్వహించి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరిచేరవన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ మల్లేశ్ యాదవ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సబ్బంది పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో....

మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతా గౌడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట పెద్దచెరువు వద్ద..

శామీర్‌పేట్: హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శామీర్‌పేట పెద్దచెరువు వద్ద స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఎయిర్‌ఫోర్స్ సిబ్బందితో పాటు గ్రామపంచాయతీ కార్మికులు, స్థానిక నాయకులు రువు పరిసరాల్లోని చెత్తను తొలగించి శుభ్రం చేశారు.


మేడ్చల్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమీషనర్


నాగారం మున్సిపాలిటీలో..